

సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,27 అక్టోబర్ 2025


8 పేజీలు


## సురక్షితంగా ఉండండి

# అప్రమత్తతే మన భద్రత

- మొంథా తుఫానుతో.. రెడ్ అలర్ట్
- అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశాలు
- కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్







**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు సూచించారు. భారత వాతావరణ శాఖ సూచనల మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల క్షేమం కోసం ఈనెల 28,29 తేదీల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారని, తుఫానుప్రభావాన్ని బట్టితదుపరిచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లతోనూ, కృష్ణా జిల్లా కలెక్టర్‌తోనూ మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం అన్నిజిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాలైన కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలు ప్రజలు మరింత అప్రమత్తతో ఉండాలని కోరారు. తుఫాను 28 రాత్రి కృష్ణా - విశాఖపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది అన్నారు.

తుఫాను రాకముందే గరిష్ట గాలి వేగం 90-110 కిమీ వరకు ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారులు, పర్యాటకులు తక్షణం అప్రమత్తం కావాలని కోరారు. బోట్లను హార్బర్‌లో నిలిపివేయాలని, అన్ని రక్షణ సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని (లైఫ్ జాకెట్లు, రెస్క్యూ వస్తువులు) అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తీరప్రాంత గ్రామాల ప్రజలను, అతి ప్రమాదాకరమైన ప్రాంతాలు నుంచి సురక్షితమైన ప్రాంతాలకు, తుఫాన్ షెల్టర్లకు ముందుగానే తరలించే చర్యలు చేపట్టామని ఈ సందర్భంగా వెల్లడించారు. స్థానిక అధికారులు, లైఫ్‌గార్డులు, పోలీసుల సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యుత్, సంచార నెట్‌వర్క్ సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధతో ఉండాలన్నారు.

- తరువాయి 2లో..

# తుఫానును సమర్థవంతంగా కలిసి ఎదుర్కొందాం

**- జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణతేజ**




కాకినాడ,మేజర్‌న్యూస్ : మొంథా తుఫాన్‌ను ప్రభావం కాకినాడ జిల్లాపై అధికంగా ఉంటుందన్న వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్,కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి మైలవరపు కృష్ణ తేజ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా మొంథా తుఫాను ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజతో కలిసి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ ఆయన క్యాంపు కార్యాలయం నుంచి మొంథా తుఫాను సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఉన్నత స్థాయి జిల్లా అధికారులు అన్ని మండలాల క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..మొంథా తుఫాను ప్రభావం తీర ప్రాంత మండలాలపై ఎక్కువ ఉండే అవకాశం ఉందన్నారు. ఈతుఫాను కారణంగా అన్ని గ్రామాల్లోనూ వర్షం కురవడంతో పాటు తీవ్రమైన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాలో ప్రధానంగా తొండంగి, ఉప్పాడ, తాళ్లరేవు, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణ ప్రాంతాధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఇప్పటికే హోప్ ఐలాండ్‌లో ఉన్న

- తరువాయి 2లో..

## ప్రైవేట్ ట్రావెల్స్ ముసుగులో...

# మహా అక్రమం డబ్బే లక్ష్యం



బస్సులో స్లీపర్ కోచ్‌లు



అధికారుల తనిఖీల నేపథ్యంలో మారిన కథ

- పరిమితికి మించి కార్గో రవాణా
- పార్సెల్ సర్వీసులతో అక్రమ రవాణాల దందా...!
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కేంద్రంగా భారీ మోసాలు
- మరోవైపు స్మగ్లింగ్ గూడ్స్ తరలింపు
- యథేచ్ఛగా బరితెగించినా పట్టించుకోని వివిధ శాఖల అధికారులు
- మీ ప్రతిఒక్కరి భద్రత మీ జాగ్రత్తలతోనే మొదలవుతుంది



కర్నూలు జిల్లాలో హైవేపై జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో నరమేధంతో కూడిన భయానక దుర్ఘటన... మరోసారి ప్రజల దృష్టిని ప్రైవేట్ ట్రావెల్స్ వ్యాపారంపై నిలిపింది. ఈ ఘోర నరమేధంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కన్నీళ్ళు ఇంకా ఆరనప్పటికీ,ఈ ప్రమాదాల వెనుక ఉన్న అసలు ముసుగు బయటపడు తోంది..అక్రమాలకు అడ్డాగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు మారాయి. నిబంధనలను కాలరాస్తూ... డబ్బే లక్ష్యంగా ఈఅక్రమార్కుల వ్యాపారం సాగుతోంది. ఓవైపు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తూ... మరోవైపు కార్గో రవాణా పేరిట పెద్దమొత్తంలో అక్రమాలు పాటిస్తూ... ధనాన్ని అర్జిస్తున్నారు. పన్నుల ఎగవేత నుంచి నిషిద్ధ వస్తువుల రవాణా దాకా, చివరికి డ్రగ్స్, గంజాయి, గుట్కా మొదలు బంగారం స్మగ్లింగ్‌వరకూ తమ బస్సులను అడ్డాలుగా మార్చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. లగేజీ కోసం ప్రత్యేక క్యాబిన్లు నిబంధనలకు వ్యతిరేకంగా స్వయంగా ఏర్పాట్లు చేస్తున్నారు.కర్నూలు బస్సు నరమేధంలో 400 ఫోన్లు బస్సులో తరలిస్తుండడం... ఆ మొబైల్స్ వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారించారు. పన్ను ఎగవేతలో భాగంగానే ప్రైవేటు ట్రావెల్స్‌లో అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలింది. ప్రైవేట్ ట్రావెల్స్ ముసుగులో పార్సెల్ అక్రమ వ్యాపారంపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

# తుఫానును సమర్థవంతంగా కలిసి ఎదుర్కొందాం

మొదటిపేజీ తరువాయి

సుమారు నూట పదిమందిని పునరావాస కేంద్రాలకు తీసుకుని రావడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొంథా తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అన్ని గ్రామాల్లో తుఫాను హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. తుఫాను వలన గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఆ గాలులకు విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు కూలిపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా తాటాకు ఇల్లు, పూరిపాకలు, మట్టి ఇల్లు, పాతబడిన ఇళ్లు, బలహీనంగా ఉన్న ఇల్లు పడిపోయే అవకాశం ఉందన్నారు. అటువంటి ఇల్లతో సహ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలలోని సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. బాలింతలు, చంటి బిడ్డ తల్లులు, వృద్ధులను సమీప ఆసుపత్రులకు ముందుగానే తరలించాలని ఆయన సూచించారు. ఆసుపత్రులలో డాక్టర్లకు ప్రత్యేక డ్యూటీ వేసి మందులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. 108, 104 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు అవసరమైన కాయగూరలు, నిత్యావసర వస్తువులు, ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అన్ని పునరావాస శిబిరాల వద్ద తప్పనిసరిగా ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. కోతకు వచ్చిన పంటలను రెండు మూడు రోజులు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గాలివానకు ఎక్కడైనా చెట్లు పడిపోతే తొలగించేందుకు రంపాలు, జేసిబీలు, క్రెయిన్లు, ట్రాక్టర్లు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా పారిశుధ్య కార్మికులను ముందుగానే రంగంలోకి దించి డ్రైనేజీలు, మురుగు కాలువల అడ్డు తొలగించడం, బ్లీచింగ్, ఫినాయిల్ చల్లే పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పడవలు ఎక్కడైనా అవసరం ఉంటే అక్కడికి చేర్చే విధంగా మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అందుకు అవసరమైన లారీలను ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో సమన్వయం చేసుకొని సమకూర్చాలని కలెక్టర్ సూచించారు.

మొంథా తుఫాన్ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో అగ్నిమాపక శాఖ ద్వారా 300మంది, ఎస్డీఆర్ఎఫ్ 50 మంది, ఎన్డీఆర్ఎఫ్ నుంచి 30 మంది జిల్లాలో అందుబాటులో ఉంచామని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన వీరిని అక్కడికి తరలించి సమస్యను పరిష్కరించేందుకు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తుఫాను ప్రభావంతో వీచే గాలులతో జిల్లాలో ప్రధాన కూడళ్ళలో ఊగిసలాడుతున్న ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని, రాకపోకల మార్గాల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుగానే జాగ్రత్త వహించాలన్నారు.

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో జిల్లాలో అన్ని మండలాల్లో ఉన్న స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఎలాంటి ఎలాంటి సంఘటనని ఎదుర్కొనేందుకు పోలీస్ యంత్రాంగాన్ని సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రభావిత ప్రాంతాల్లో అదనంగా ఇన్స్పెక్టర్లను పంపించడం జరిగిందన్నారు. తుఫాను ప్రభావ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు వైర్‌లెస్ సెట్లు సిద్ధంగా చేశామని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ జె.వెంకట్రావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆదిత్య'లో అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ "ప్లేబో పికాసో" జయంతిని అంతర్జాతీయ కళాకారుల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో పాల్గొన్న విద్యార్థినీలను అభినందించారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ విద్యార్థినీలలో సృజనాత్మకత పెరగడానికి కళలు దోహదం చేస్తాయని, ప్రతి విద్యార్థినీలు ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రలేఖనం, వ్యాసరచన, ముఖాభినయం తదితర పోటీలు ఎన్.ఎస్.ఎస్.యూనిట్ – 1 వాలంటీర్లు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ యమ్.శ్రీనివాస్, కె.నవ్య మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి






రంపచోడవరం, మేజర్ న్యూస్ : గిరిజన ప్రాంతంలో రామకృష్ణ మిషన్ ద్వారా ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయానంద విజ్ఞప్తి చేసారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో స్థానిక సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ వివేకానందజీ చెప్పినట్లు శివజ్ఞానే జీవసేవ అని, ప్రతి రోగిలో ఉన్న శివునికి సేవ చేయాలనే ఉద్దేశంతో రామకృష్ణ మిషన్ గత నాలుగు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం తో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ పోతుల రామారావు డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, డాక్టర్ ఉమా మహేష్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన 55 మందికి రక్తపరీక్షలు, 10 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురుకి ఇ.సి.జి లు, 8మందికి ఎక్స్ రేలు, 18మందికి ఫిజియథెరపీ చేసినట్లు స్వామిజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ పోతుల రామారావు మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం రోగులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవడం, మందులు వాడటంతోపాటు శారీరక శ్రమ నడక, యోగా, ధ్యానం వంటివి పాటించాలని, ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకొని సంతోషకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, రామకృష్ణ మిషన్ వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామిజీ తెలిపారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ ముసుగులో... మహా అక్రమండబ్బే లక్ష్యం

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** ప్రైవేట్ ట్రావెల్స్ పేరుతో నడుస్తున్న సంస్థలు రవాణా వ్యాపారం కంటే, పార్సెల్ వ్యాపారమే ప్రధాన ఆదాయ వనరగా మారాయి. కాకినాడ, తుని, అమలాపురం, పెద్దాపురం, మండపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, గోకవరం ప్రాంతాల్లోని అనేక ట్రావెల్స్ సంస్థలు పార్సెల్ విభాగం పేరుతో పెద్దయెత్తున అక్రమ రవాణాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రతిరోజు వందల సంఖ్యలో బయలుదేరే బస్సుల్లో పార్సెల్ బాక్సులు, సంచులు, ప్యాకెట్లు కుప్పలుగా వస్తూ పోతున్నాయి. వీటిలో ఏ వస్తువులు ఉన్నాయో, ఎవరి దగ్గరకు వెళ్తున్నాయో ఎవరికీ తెలియదు. పరిశీలిస్తే వీటిలో మద్యం స్మగ్లింగ్, డ్రగ్స్, గంజాయి, గుట్కా, కరెన్సీ హవాలా, నకిలీ వస్తువులు, మందులు, గోల్డ్ లావాదేవీలు వంటి అనేక అక్రమాలు దాగి ఉంటున్నాయని సమాచారం.

వాణిజ్య పన్నులు, కమర్షియల్ లైసెన్సులు, ఇన్‌కమ్ టాక్స్ చెల్లింపులు లేకుండా జీరో రికార్డులతో లక్షల టాక్స్ ఎగవేస్తున్న ఈ సంస్థలు కోట్లలో లాభాలు గడిస్తున్నాయి. ఈ సంస్థల ప్రైవేట్ బస్సులు రవాణా శాఖ రూల్స్‌కి విరుద్ధంగా ఓవర్ లోడింగ్, నిషేధిత వస్తువుల రవాణా, డ్రైవర్ డ్యూటీ అవర్స్ ఉల్లంఘన, రిజిస్ట్రేషన్ లోపాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల లేమి వంటి నిబంధనల కతీతంగా నడుస్తున్నాయి. ప్రజల ప్రాణాల కంటే డబ్బు ముఖ్యం అవ్వడంతో ఇలాంటి ప్రమాదాలు మళ్ళీ మళ్ళీ చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, పోలీస్ శాఖలు తక్షణమే ఈ ప్రైవేట్ ట్రావెల్స్ వ్యాపారాలపై విచారణ, ఆకస్మిక తనిఖీలు చేపడితే, రాబోయే రోజుల్లో మరింత పెద్ద దందాల అక్రమాలు, రాజకీయ ముసుగులో కొందరు పెద్దల అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అధికారుల కనుసన్నల్లోనే...

ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వెనుక రవాణా శాఖ అధికారుల పాత్ర నెలవారి మామూళ్ళ రూపంలో ఉందనే విమర్శలున్నాయి. బస్సుల్లో సీటింగ్ సహా ఇతర ఆల్ట్రేషన్ లేకుండా చూడాలి. అధిక లోడుతో వెళ్ళే బస్సులను నిలువరించి తనిఖీలలో కేసులు పెట్టి సీజ్ చేయాలి. కార్గో రవాణాకు అనుమతులు ఉందీ లేనిదీ పరిశీలించాలి. ఇవన్నీ కట్టడి చేయాల్సిన బాధ్యత రవాణా శాఖదే... పకడ్బందీగా రోజువారీ తనిఖీల చేసినప్పుడే ఇది సాధ్యపడుతుంది. ప్రమాదం జరిగిన సమయంలో హడావుడి చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రభుత్వం ఆగ్రహిస్తే తప్ప తనిఖీల ఊసే ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల దందాకు అడ్డుకట్ట వేయాలని, రవాణాశాఖ అధికారుల అవినీతికి చెక్ పెట్టాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

## సురక్షితంగా ఉండండి అప్రమత్తతే మన భద్రత

మొదటిపేజీ తరువాయి

రోడ్లు, జల మార్గాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటే మంచిదని సూచించారు. తుఫాను కోసం ఇబ్బందులు ఉంటే ఆయా కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సహాయం పొందాలని మంత్రి సుభాష్ ప్రజలకు తెలిపారు.

## మండలంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** మండలంలోని నాగుల చవితి వేడుకలు మండల ప్రజలంతా ఘనంగా నిర్వహించారు. శనివారం నాగుల చవితి పర్వ దినాన్ని పురస్కరించుకొని రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు తెల్లవారుజామునుండే పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతను ఆరాధించారు. ముందుగా పుట్టకళ్ళు చేసి, పేడతో కల్లాపు వేసి, వరి పిండితోముగ్గులు వేసి,పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. చలిమిడి, వడపప్పు, నువ్వు చిమ్మిడా, టెంకాయ గుంజు, గ్రుడ్లు పుట్టకన్నాల్లో వేసి పాలు పోసి నాగులకు పూజలు చేశారు. టెంకాయ కొట్టి, హారతులు ఇచ్చి, నాగుల టవలుసమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తోక తొక్కితే తొలగిపో, పడక తొక్కితే పగవాడు అనుకోకు, నడుము తొక్కితే నా వాడు అనుకో సంవత్సరం అంతా మా కుటుంబ సమేతంగా నిన్ను ఆరాధిస్తాము స్వామి అని వేడుకున్నారు. టపాసులు బానిసంచాలు పేల్చి పిల్లాపాపలతో పుట్టల వద్ద సంతోషంగా గడిపారు.

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారంతోరణాలు చేతికి కట్టుకొని పుట్టమన్ను చెవులకు పెట్టుకుని చెవికి సంబంధించిన వ్యాధులు దూరం అవడమే కాకుండా సంవత్సరం అంతా ఆరోగ్యంగా ఉంటామని ప్రజల నమ్మకం.

# పనిగంటలు పెంపును వ్యతిరేకించండి

**- పరిశ్రమలలో ప్రమాదాలును అరికట్టే చర్యలు చేపట్టండి**
**- సిఐటియు జిల్లా మహాసభలలో 22 తీర్మానాలకు ఆమోదం**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని, సిఐటియు జిల్లా మహాసభ తీర్మానించింది. అలాగే పరిశ్రమలలో ప్రమాదాలు అరికట్టే చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేసింది. పెద్దాపురం పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో సిఐటియు 12వ జిల్లా మహాసభ రెండవ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా 22 తీర్మానాలను మహాసభ ఆమోదించింది. పనిగంటల పెంపును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ ప్రవేశపెట్టారు. కాకినాడ జిల్లాలో పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూ పదుల సంఖ్యలలో కార్మికుల మృతి చెందుతున్న ఘటనలు ఎక్కువయ్యాయని, ఎక్కడైతే కార్మికులు పోరాడుతున్నారో అక్కడ మాత్రమే బాధితులకు పరిహారం చెల్లింపు జరుగుతుందని, కార్మిక సంఘాల దృష్టికి రాని అనేక ప్రమాదాలలో బాధితులకు చట్టప్రకారం కనీస పరిహారం కూడా అందడం లేదని, ఏ పరిశ్రమలోను ప్రభుత్వ అనుమతి లేకుండా సేఫ్టీ అధికారులు, కార్మిక శాఖాధికారులు, స్వతంత్రంగా తనిఖీ చేయడానికి వీలు లేదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో పరిశ్రమలలో పనిచేసే కార్మికుల భద్రత లేకుండా పోయిందని, ఇదే అదునుగా పరిశ్రమలలో నాణ్యత లేని మిషనరీలు, పరికరలు ఉపయోగించడంతో లాభాలు పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో యజమాన్యాలు చూస్తున్నాయని, ప్రస్తుతం అన్ని పరిశ్రమలలో సేఫ్టీ తనిఖీలు చేయాలని, సేఫ్టీ ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని మహాసభ ముందు తీర్మానం ప్రకటించారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించంతో పాటు 21 తీర్మానాలను కూడా ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబిరాణి, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, పద్మ, జిల్లా కార్యదర్శులు డి.క్రాంతికుమార్, చంద్రావతి, గడిగట్ల సత్తిబాబు, ఎస్.శ్రీనివాస్, దాడి బేబి, ఎస్తేర్ రాణి, టి.ఎల్.పద్మ, కేదారి నాగు, మాగాపు నాగు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో రైతులకు తీవ్ర అన్యాయం



**- 76 సంవత్సరాలుగా రైతులు పేరు మీద ఉన్న భూమిని దేవస్థానంకు అప్పగింత**
**- నవంబర్ 1న జరిగే వేలంపాటను అడ్డుకోండి**
**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు రైతులకు పిలుపు**

**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** యు కొత్తపల్లి మండలం కొమరగిరి పంచాయతీకి సంబంధించిన సర్వేనెంబర్ 121, 122 గల 20 ఎకరాల జిరాయితీ భూమిని 1949 నుండి బలహీనవర్గాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్నారని, కానీ నేడు మూడు రోజుల క్రితం దేవస్థానం డిపార్ట్మెంట్ వారు బోర్డు పెట్టి జెండాలు పాతి ఇది మా భూమి అని చెప్పడం అన్యాయమని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఇలాకాలో రైతులకు అన్యాయం జరగడం దారుణమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఆదివారం ఉదయం సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి శాఖ రామకృష్ణ ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్క శ్రీనివాసరావు తదితరులతో కూడిన బృందం కొమరగిరిలో 20 ఎకరాల భూమిని పరిశీలించింది. అక్కడ రైతుల ఆవేదనను ఆలకించింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం నుండి అంటే సుమారు 90 సంవత్సరాలుగా పొజిషన్లో ఉండి లింక్ డాక్యుమెంట్లు , పాస్ పుస్తకాలు, పేరడంగల్ వన్ బి రికార్డు రెవిన్యూ పనులు రైతు భరోసా లోన్స్ ఇన్ని అర్హతలు ఉన్న భూమిని ఎండోమెంట్‌అటాచ్మెంట్ చేసుకోవడం దారుణమన్నారు. 2006 సంవత్సరం నుండి ఇది కోర్టులో ఉన్న ఇప్పటికి ఎండోమెంట్ వెనకాల కొంతమంది అధికార పార్టీ పెద్దల హస్తంతో ఈ కుట్ర జరిగిందన్నారు. 2012 అప్పటి కలెక్టర్ ఆర్డిఓ స్థానిక తాసిల్దార్ ఇది ఎండోమెంట్ భూమి కాదని జిరాయితీ భూమి అని పేపర్ ప్రకటన ఇచ్చిన అధికార పార్టీ అండదండలతో ఈ భూమిని ఆక్రమించుకున్నారని మధు విమర్శించారు. ఇన్ని సంవత్సరాలగా ఏ ఎమ్మెల్యే ఏ అధికారులు ఈ భూమిపై కన్నెత్తి చూడలేదని, కానీ నేడు స్థానిక ఎమ్మెల్యే ఇంచార్జ్ అండదండలతోనే ఇదంతా జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారని మధు పేర్కొన్నారు.

నవంబర్ 1న గొర్స ప్రాంతంలో వేలంపేట పెట్టారని ఇలాంటి అన్యాయమైన వేలం పాటను చుట్టుపక్కల ఉన్న రైతులు వారికి అండగా వచ్చి అడ్డుకోవాలని, అన్ని రాజకీయ పార్టీలు అన్ని ప్రజాసంఘాలు మద్దతు తెలపాలని మధు కోరారు. దీనిపై పిఠాపురంలో రౌండ్ టేబుల్ వేసి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని మధు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ, సుబ్బారావు, కృష్ణ, బాపనయ్య, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను దృష్ట్యా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

## - కమిషనర్ కె.టి.సుధాకర్

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** తుఫాను దృష్ట్యా కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయాల్లో అక్టోబర్ 27వ తేదీన అనగా సోమవారం నిర్వహించవలసిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమమును రద్దు చేయడమైనదని కాకినాడ లగడపాటి సంస్థ కమిషనర్ కె.టి. సుధాకర్ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కావున నగర ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేసిన విషయాన్ని గమనించవలసిందిగా పత్రికా ప్రకటన ద్వారా కమిషనర్ ప్రజలకు తెలిపారు.

## మహిళా మార్ట్ ద్వారా నాణ్యమైన సరుకులు అందించాలి

**- ఐటీడీఏ పివో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో మహిళా మార్ట్లు ద్వారా ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పివో స్మరణ్ రాజ్ సూచించారు. ఏజెన్సీలో వందన్ వికాస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి ప్రాసెస్ చేసిన జీడిపప్పును వినియోగదారులకు విక్రయించే విధంగా ప్రోత్సాహించాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలోని మహిళా మార్ట్ ను ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో వందన్ వికాస కేంద్రాలు ద్వారా కొనుగోలు చేసిన జీడిపిక్కలను ప్రాసెస్ చేసిన తర్వాత జీడిపప్పును సరసమైన ధరలకు అమ్మాలని మహిళా మార్ట్ ప్రతినిధులను ఆయన ఆదేశించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లో వివిధ రకాల నిత్యావసర వస్తువులు ప్రజలకు సరసమైన ధరలకు విక్రయించి మహిళా సంఘాలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా పిఒ మహిళా ప్రతినిధులతో మాట్లాడుతూ వివిధ రకాల నిత్యావసర వస్తువులు ఎంత ధరలకు అమ్ముచున్నది ఆరా తీశారు.

# మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలి

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలోఈ నెల 27, 28, 29 తేదీలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనీ అన్ని విద్యాసంస్థలకు తాత్కాలిక సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలన్నారు. ఇప్పటికే సముద్ర తీరం వెంబడి ఉన్న ఆవాసాలకు పునరావాస కేంద్రాలు మ్యాపింగ్ చేసి తుపాను హెచ్చరికలకు అనుగుణంగా తరలింపు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు విద్యుత్తు పునరు ద్ధరణకు సమాయత్తం కావాలని ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్లను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లు సి పి డబ్ల్యు ఎస్ ఇతర సురక్షిత త్రాగునీటి ప్లాంట్ల వద్ద విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను అమర్చి నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు సరఫరా చేయాలన్నారు. ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ ఇంజనీర్లు 100 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులు మూలంగా రహదారులపై అడ్డంగా చెట్లు పడే అవకాశం ఉందని ఆ దిశగా తొలగింపుకు జెసిబి లు పవర్ రంపాలు క్రేన్లతో సిద్ధంగా ఉంచాలన్నారు. తుఫాన్ హెచ్చరికలకనుగుణంగా తీరప్రాంత ఆవాసాలలో ముంపు బారిన పడే అవకాశం ఉన్న ముంపు బాధితులను ముందుగానే మ్యాపింగ్ చేసిన పునరావాస కేంద్రాలకు పున రావాస కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలలకు తరలించాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికలకు అనుగు ణంగా సహాయక చర్యలను చేపట్టేందుకు సమాయత్తం కావాలన్నారు. పునరావాస కేంద్రాలలో వసతి ఆహారం వంటి సౌకర్యాలతోపాటుగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ ముంపు బాధితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలన్నారు.

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో గొప్ప రికార్డ్






- 100% డెలివరీలు
- సూపరింటెండెంట్, గైనకాలజిస్టు లు, సిబ్బంది కృషి ఫలితం
- అభినందించిన ప్రాజెక్ట్ అధికారి

**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ఒక రికార్డు సృష్టించింది. ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 100 ప్రసవాలు అక్టోబర్ నెలలో అవ్వడంతో ఈ రికార్డు సొంతం చేసుకుంది. పదేళ్ల క్రితం రాష్ట్ర విభజన జరిగాక విలీన మండలాలైన చింతూరు కూనవరం ఎటపాక, వరరామచంద్రాపురం మండలాలకు వైద్య సేవలు అందని ద్రాక్షా గానే మారింది. దీంతో ప్రజలు వైద్య సేవలకోసం నానా రకాలుగా ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ప్రారంభం నుండి సివిల్ ఆసుపత్రి గా ఉన్న చింతూరు ఆసుప్రత్రి 2018 నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అప్ గ్రేడ్ అయ్యింది. 2022 నుండి స్పెషలిస్ట్ వైద్యులను వైద్య ఆరోగ్య శాఖ నియమించడంతో ఈ ఆసుపత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో విలీన మండలాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. చింతూరు ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ ఒకరు, జనరల్ ఫిజిషియన్ ఒకరు, చెవి ముక్కు, గొంతు వైద్యులు, పిల్లల వైద్యులు, అనస్థిసియా (మత్తు డాక్టర్), ఇద్దరు జనరల్ వైద్యులను నియమించడంతో ప్రజలకు మంచి సేవలు అందే అవకాశం వచ్చింది.

**ప్రసవాలపై ప్రత్యేకదృష్టి..** 2023లో డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి సూపరింటెండెంట్గా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో ఆయన ప్రజలకు అన్నీ రకాల వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ప్రసవాలు పెంచడం అన్ని రకాల ఆపరేషన్లు చింతూరులో జరిగే విదంగా ప్రయత్నించడంతో ఆసుపత్రిలో రోజువారీ ఔట్ పేషెంట్స్, ఇన్ పేషెంట్స్ సేవలు బాగా పెరిగాయి. ముఖ్యంగా ప్రస వాలు ఎక్కువగా పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు.సూపరింటెండెంట్ డా.ఎం.వి. కోటిరెడ్డి, మత్తుడాక్టర్ కావడం, గైనకాలజిస్ట్లు డా. ఎం.వి.రమణా రావు, డా శశికళ సమిష్టితో ప్రసవాల పెంపుకు కృషి చేసారు. దీంతో అక్టోబర్ నెలలో 100 ప్రసవాల టార్గెట్ను సాధించడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉంది. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది జనవరి నుండి అక్టోబర్ నెల వరకు అయిన ప్రసవాల వివరాలు : జనవరి 64, ఫిబ్రవరి 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50, ఆగష్టు 92, సెప్టెంబర్ 95, అక్టోబర్ 100 అయ్యాయి.

ఎస్.ఎన్.సీ.యూ. చిన్న పిల్లల యూనిట్లో ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లల వైద్య సేవల కోసం పిడియాట్రిషియన్, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండడం విశేషం. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి నాలుగు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్ గడ్ రాష్ట్రాల ప్రజలకు ఇదే ప్రధాన ఆసుపత్రి.

చింతూరు ప్రభుత్వలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేయాలి. ప్రస్తుతం జనరల్ ఫిజిషియన్, ఈఎన్టీ, ఆర్థోపెడిక్, పెడియాట్రిక్ వైద్య పోస్టులు భర్తీ చేస్తే ఇంకా ప్రజలకు వైద్య సేవలు అందించవచ్చునని పలువురు పేర్కొంటున్నారు. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ఇటీవల 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్గా ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇక్కడ ప్రజలకు త్వరలో నే ఇంకా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

# శెట్టిబలిజ కార్తీక వన సమారాధనకు విజయవంతం చేయండి

– శెట్టిబలిజ నాయకులు సంసాని



అమలాపురం, మేజర్ న్యూస్ : నవంబర్ 9న అమలాపురంలో నిర్వహిస్తున్న కోనసీమ శెట్టిబలిజ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోనసీమ శెట్టిబలిజ ఆహ్వాన కమిటీ పిలుపు నిచ్చింది. స్థానిక వాసర్ల గార్డెన్స్లో వాసర్ల ఆదివారం శెట్టిబలిజ కార్తీక వన సమారాధనకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ వన సమారాధనకు ఉభయ రాష్ట్రాలలో ప్రతి జిల్లాలోని మండలాలు గ్రామం నుండి మహిళలు కుటుంబ సామేతంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు ఎం.ఎం.సాహెబ్ శెట్టి, సంసాని వెంకట చంద్రశేఖర్ (నాని), చెల్లుబోయిన శ్రీనివాస రావు, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి బాబు, వాసంశెట్టి తాతాజీ, చిట్టూరి పెదబాబు, ఇళ్ళ శేషరావు, పితాని బాలకృష్ణ, సానబోయిన మల్లిఖార్జునరావు, గుత్తుల చిరంజీవి, మట్టపర్తి రామారావు, దొమ్మేటి ఉమామహేశ్వరరావు, వాసర్ల వెంకన్న, గోవ్వాల రాజేష్, దొంగ చిన్న, వాసర్ల సుబ్బారావు, విత్తనాల శేఖర్, బొక్క శ్రీను, వాసంశెట్టి శ్రీరామ్, విత్తనాల మూర్తి, మట్టపర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

# 'మొంథా' తుఫాను నేపథ్యంలో ముందస్తు చర్యలు మరియు సహాయ చర్యలపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు విజ్ఞప్తి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాబోయే తీవ్ర తుఫాను 'మొంథా' నేపథ్యంలో, కాకినాడ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో, రాజ్యసభ సభ్యులు, కాకినాడ వాసి, సానా సతీష్ బాబు ఆదివారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ లకు అధికారికంగా లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, అక్టోబర్ 28వ తేదీ సాయంత్రం 'మంథా' తుఫాను కాకినాడ తీరాన్ని తాకే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు యుద్ధప్రాతిపదికన తక్షణ ముందస్తు మరియు సహాయక చర్యలు చేపట్టాలని సతీష్ బాబు కోరారు. తీరప్రాంతం మరియు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తక్షణమే తరలించాలని, విద్యుత్ మరియు సమాచార వ్యవస్థలు నిరంతరంగా కొనసాగేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైన ఆహార, వైద్య సరఫరాలు మరియు పటిష్టమైన భద్రతా షెల్టర్లను అందుబాటులో ఉంచాలని, పోలీసు, వైద్య, మున్సిపల్ సహా అన్ని సంబంధిత శాఖల మధ్య సమన్వయం చేసి, అప్రమత్తతతో చర్యలు చేపట్టాలని ఆ లేఖలో సూచించారు. సానా సతీష్ బాబు తన లేఖలో, ప్రజల సహాయం మరియు సమాచార పరిపాలనతో సమన్వయం కోసం తన కార్యాలయం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సానా సతీష్ బాబు కార్యాలయం సహాయక నంబర్లు : 0884 297 3555, 9666622227. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఈ నంబర్లను సంప్రదించవచ్చున్నారు. తుఫాను వలన ప్రభావితమైన ప్రజలకు సమాచార మరియు సహాయ కార్యక్రమాలలో తమ బృందం పూర్తిగా సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైన ప్రతి సహాయానికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ జిల్లా అధికారులతో కలిసి పనిచేయడానికి సంసిద్ధంగా ఉన్నాము అని తెలియజేసారు.

# ప్రధాని మోదీ మన్ కీ బాత్

– వీక్షించిన భాజపా నేతలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రధాని మోదీ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని భాజపా నేతలు బిజెపి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర మేధావుల సంఘం కన్వీనర్ డా. ముత్తా నవీన్ కృష్ణ అన్నారు. ఆదివారం శ్యామ్ ఇనిస్టిట్యూట్లో మోదీ 127వ మన్కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ ప్రజలతో మమేకం కావాలనే లక్ష్యంతో మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. ఈనాటి మన్కీ బాత్లో మేకిన్ ఇండియా కార్యక్రమంతో భారత్ తయారీ రంగంలో భారత్ పవర్ హౌస్గా మారిందని మోదీ వెల్లడించారన్నారు. నవంబర్ 7వ తేదీన వందేమాతరం రూపొందించి 150ఏళ్ళుపూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. స్వదేశీ వస్తువులను ప్రతి ఒక్కరు వినియోగించాలన్నారు. అక్టోబర్ 31న వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు కవికొండల భీమశంకర్, కవికొండల చలపతిరావు, సిహెచ్ సాంబశివరావు, శిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాలుతిమ్మాపురం టిడ్కో గృహాలలో పోలీసుల కార్డన్ సెర్చ్





**పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ :** కాకినాడ ఎస్పి జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్లో భాగంగా పెద్దాపురం వాలుతిమ్మాపురం రోడ్డులో టిడ్కో గృహాలలో పోలీసులు ఐదు బృందాలుగా విస్తృత తనిఖీలు ఆదివారం తెల్లవారుజామున 4 గ ంటల నుండి నిర్వహించారు. దీనిలో భాగంగా ద్విచక్ర వాహనాలను, ఆటోలను రికార్డులు లేనివాటిని గుర్తించారు. పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్శంకర్ ఎస్సై వి.మౌనికలు టిడ్కో గృహాలలో ఉన్న వార్కి సూచనలిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే తక్షణమే సమాచారం అందించాలని, పోలీస్ అధికారుల మొబైల్ నెంబర్లు ఇవ్వడం జరిగింది. బయట వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం కోసం వచ్చిన తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్డన్ సెర్చ్లో క్రైమ్ సిఐ అంకారావు, జగ్గంపేట ఎస్సైలు రఘురామ్, నాగబాబు, 50మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

– పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం,మేజర్న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదంస్వీకరించారు.వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామ చంద్రప్రసాద్ (నాని),రాయ విజయ్కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# గాలి బంగ్లా మూవీకి క్లాప్ కొట్టిన ముప్పన





- కెమెరా స్విచ్ ఆన్ చేసిన పేర్నిడి
- గాలి బంగ్లా బ్లాక్ బస్టర్ అవ్వాలి : హీరోయిన్ నుపూర్ ముఖర్జీ
- ధన్యవాదాలు తెలిపిన డైరెక్టర్ సత్య సలాది

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఎస్.ఎస్. ఫిలిం అకాడమీ బ్యానర్‌పై వారెవ్వా జతగాళ్ళు యంగ్ డైరెక్టర్ సత్య సలాది కథ స్క్రీన్ ప్లే,దర్శకత్వ పర్యవేక్షణలో నిర్మిత మైన హర్రర్ సస్పెన్స్ మూవీ గాలి బంగ్లా చిత్రం షూటింగ్ సామర్లకోట, పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. పెద్దాపురం గాలి బంగ్లాలో జరిగే క్షుద్రపూజ సన్నివేశాలను నటీనటులపై డైరెక్టర్ సత్య సలాది చిత్రీకరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముప్పవరపు వీర్రాజు 12వ షెడ్యూల్‌కు క్లాప్ కొట్టగా పేర్నిడి ఈశ్వరరావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పెద్దాపురం నియోజకవర్గం ఉండూరు గ్రామానికి చెందిన మన జిల్లా వాసి సత్య సలాది పెద్దాపురం మహారాణి కాలేజీలో ఇంటర్ డిగ్రీ చదువుకొని మన ప్రాంతానికి సంబంధించిన ఒక చక్కటి కథను ఎంతో పేరున్న ఈ గాలి బంగ్లా సినిమా టైటిల్‌తో చిత్రీకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మన జిల్లాకు చెందిన నూతన నటీనటులతో ఈ చిత్రం నిర్మించడం, మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. భవిష్యత్తులో సత్య సలాది టాప్ డైరెక్టర్ అవ్వాలని, అలాగే హీరోగా నటిస్తున్న జెన్యూన్ స్టార్ లక్ష్మణ్ ఈ చిత్రంతో హ్యాట్రిక్ కొట్టాలని అన్నారు. హీరోయిన్ నుపూర్ ముకర్జీ మాట్లాడుతూ ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అవ్వాలని అన్నారు. వారి తల్లి శ్రావణి ముఖర్జీ మాట్లాడుతూ మా అమ్మాయి హీరోయిన్‌గా తెలుగులో ఇది మొదటి చిత్రం అని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు అందరూ ఆదరించాలని, ఇక్కడ ప్రజలు, వాతావరణం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, డైరెక్టర్ సత్య వారికి జన్మంతా రుణపడి ఉంటామని కన్నీటిపర్యంతమయ్యారు. డైరెక్టర్ సత్యసలాది మాట్లాడుతూ నా మొదటి చిత్రం వారేవా జతగాళ్ళు, రెండవ చిత్రం బెట్టింగ్ గ్యాంగ్ కేరాఫ్ కాకినాడ, మూడో చిత్రంగా ఇది గాలి బంగ్లా దర్శకత్వం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలగా పిట్టా మణిరాజ్, గరగ వీరబాబు, కెమెరామెన్ నాకు అండగా వున్నారని, ఎంతో టాలెంట్ ఉన్న నటీనటులు మన జిల్లాలో ఉన్నారని, వాళ్ళలో ఉన్న నైపుణ్యతను బయటికి తీసుకురావాలని మంచి నటులను చేయాలని ఆకాంక్షతో ఎక్కువ శాతం కొత్తవారికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. నా గత చిత్రాల్లాగే ఈ చిత్రాన్ని కూడా ఆదరించాలని, ఈ చిత్రం షూటింగ్‌కి అడిగిన వెంటనే గాలి బంగ్లాకు అవకాశం కల్పించిన పెద్దలు ముప్పన వీర్రాజు, పేర్నిడి ఈశ్వరరావు, నా చిత్రానికి నా వెంటే ఉంటూ అన్ని సహాయ సహకారాలు అందిస్తున్న మా బాబాయ్ మామిడి ఈశ్వరరావుకు పాదాభివందనం చేస్తున్నా అన్నారు. ఈ చిత్రంలో అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, మరియు ప్రధాన తారాగణంగా ఆలయ అర్చకులు (పంతులు)గా తోట ప్రసాద్, రాజావారుగా రాజుపూడి, అఘోరాగా నారా ప్రసాద్, ఇతర తారాగణంగా జూనియర్ ఎన్టీఆర్ సతీష్, గిడుతూరి శ్రీనివాస్, సలాది మహేష్, పర్వీన్ షేక్, సురేష్ బాబు, భగవాన్, కర్రి బాబురావు, కర్రి ప్రభాకర్, ఎస్.సురేష్, భవాని, లక్ష్మి, అన్నవరం, సుంకర నాగరాజు, రాములు, గంగారాం, మూర్తి, రవి, అభిషేక్ పాల్గొన్నారు.

# రాజవొమ్మంగిలో హిందూ స్మశాన వాటికకు రహదారి సదుపాయం

- సర్పంచ్ రమణి



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి గ్రామ పంచాయతీకి చెందిన హిందూ స్మశాన వాటికకు రహదారి సదుపాయం కొరకు తుప్పలు జెసిపితో క్లియరెన్స్ చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి తెలిపారు. స్థానిక శాంతినగర్ బ్రిడ్జిని అనుకుని ఉన్న సుమారు అరకం మేర అనాది కాలం నుండి హిందూ స్మశాన వాటికగా తెలిసిందే. మౌలిక సదుపాయాలు లేక ఎవరైనా మరణిస్తేదహన సంస్కారాలు చేసుకొనుటకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఒట్టిగడ్డ కాలవను ఆనుకొని ఉన్న ఈ స్మశాన వాటికకు వెళ్లాలంటే వర్షాలు కురిసిన, కొండ వాగు పొంగిపోర్లిన దహన సంస్కారాల కష్టమే. ప్రజలు పడుతున్న అవస్థలను చూసి గ్రామ సర్పంచ్ రమణి ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు నేతృత్వంలో ఆదివారం పనులు ప్రారంభిం చారు. అలానే శాంతినగర్ బ్రిడ్జి పనులు సంబంధిత శాఖ అధికారులుప్రారంభించినట్లయితే స్మశాన వాటికతో పాటు సుమారు 10 గ్రామాల గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందు నిమిత్తం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఏపీ ఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగింది.

# తుఫాన్‌పై కమిషనర్ సుధాకర్ సమీక్ష



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాన్ కాకినాడపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం నేపథ్యంలో కాకినాడ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ శాన్మోహన్ సగిలి ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ కె.టి.సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ నగర ప్రత్యేక అధికారి హౌసింగ్ పీడీ ఎం.వి.వి.సత్యనారాయణ పాల్గొని వివిధ శాఖల అధికారులతో కార్పొరేషన్ కమిషనర్ సుధాకర్‌తో కలిసి సమీక్షించారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 27, 28, 29 తేదీల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తాయని, ప్రజల ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. జేసీబీలు, క్రేన్లు సిద్ధంగా ఉంచాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సమీపంలోని తుఫాన్ షెల్టర్ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులను గుర్తించి ఆసుపత్రులకు తరలించే చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు వారు సూచించారు. దుమ్ములపేట ప్రాంతంలో 76 పాకలలో 187 మంది, ఏటుమొగ ప్రాంతంలో 75పాకలలో 213మంది నివాసిస్తున్నారని, వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొత్తం 66 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, త్రాగునీరు, కొవ్వొత్తులు, జనరేటర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని కమిషనర్ వివరించారు. అత్యవసర సహాయంకోసంకార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (టోల్ ఫ్రీ నంబర్: 1800-425-5990) ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనేఈనంబర్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విపత్తు సమయంలో సేవలందించేందుకు చేయూత, ఆల్ ఇజ్ వెల్, లిటిల్ హార్ట్స్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఇ. పి.వెంకటరావు, తహశీల్దార్ జితేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీ చరణ్, అగ్నిమాపక అధికారి సుబ్బారాజు, అటవీశాఖ అధికారులు, వైద్య శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు,ట్రాఫిక్ సీఐ ఎన్. రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.రవి కుమార్, కిషోర్, ఐశ్వర్య పాల్గొన్నారు.

## నేత్రదానం చేసిన కోడూరి వెంకట్రావు ఆదర్శనీయుడు

- కేఎస్ జవహర్



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** జగ్గంపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన టిడిపి నేత జగ్గంపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కోడూరి సత్యనారాయణ, తండ్రి వెంకట్రావు ఇటీవలే మరణించడంతో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్ పర్సన్ కె ఎస్ జవహర్ ఆయన స్వగృహంలో వెంకట్రావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం కోడూరి సత్యనారాయణ, శివరామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరణానంతరం నేత్రదానం చేసిన కోడూరి వెంకట్రావుని స్మరించుకుంటూ అన్ని దానాల కన్నా నేత్రదానం చాలా గొప్పదని తాను మరణిస్తూ మరొకరికి చూపుని ప్రసాదించిన వెంకట్రావు ఆదర్శనీడని జవహర్ ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జిల్లా విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, జగ్గంపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబత్తుల చంద్రశేఖర్, తాతినేని నాగేశ్వరరావు, కుదప మురళీకృష్ణ, పిండి రెడ్డమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

## వేరు వేరు చోట ఇద్దరు మిస్సయిన కేసులు చేదించిన పోలీసులు





**గండేపల్లి,మేజర్‌న్యూస్:** మండలంలోని నీలాద్రి రావు పేట, మురారి గ్రామాలలో ఇద్దరు మిస్సయిన కేసులు నమోదు చేసి వారిని ట్రేస్ చేసి కనిపెట్టడం జరిగిందని గండేపల్లి ఎస్సై శివనాగబాబు ఒక ప్రకటనలో తేలుతారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారకరప మండలంనాకు చెందిన ఒక అతను 35 సంవత్సరాలు మురారి గ్రామానికి వచ్చి మిస్సింగ్ కావడం జరిగింది. దానిపై గండేపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు క్రైం నం: 341/2025 గా నమోదు చేయడం జరిగింది. దానిపై డి.ఎస్.పి శ్రీహరి రాజు పెద్దాపురం మరియు జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ గార్ల ఆదేశాలు ప్రకారం గండేపల్లి ప్రత్యేక టీమ్ను ఏర్పాటు చేసి ఏ ఎస్ ఆర్ జిల్లాలో భద్రంగా ట్రేస్ చేయటం జరిగింది. సదరు వేక్తిని అరకువాలీ నుండి గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అతని తల్లి తండ్రులకు అప్పగించడం జరిగింది అన్నారు. అలాగే గండేపల్లి మండలం, నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన ఒక వివాహితురాలు అయిన 39 సంవత్సరాలు వయసుగల ఒక మహిళ మిస్సింగ్ కావడం జరిగింది. దానిపై గండేపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు క్రైం నం: 342/2025 గా నమోదు చేయడం జరిగింది. దానిపై ప్రత్యేక టీమ్ను ఏర్పాటు చేసి కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు గ్రామంలో భద్రంగా ట్రేస్ చేయటం జరిగింది. ఆమెను గొల్లప్రోలు గ్రామం నుండి నుండి గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఆమె తల్లి, మరియు భర్తకు అప్పగించడం జరిగింది వారు తెలిపారు.

## ఏలేరు రెగ్యులేటర్‌ను పరిశీలించిన తహసిల్దార్ వెంకటలక్ష్మి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో ఏలేరు రెగ్యులేటర్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తహసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి కాండ్రకోట గ్రామంలో ఏలేరు రెగ్యులేటర్ పరిశీలించి వరద ఉధృతి ఏ మేరకు ఉందో ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. గంట గంటకు నీటి ప్రవాహం పెరగడంతో కాండ్రకోట గ్రామం నుంచి కట్టమూరు , జె.తిమ్మాపురంతో పాటు రైతులు పొలాల వెళ్లే పాత రన్ వే పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు తీసుకున్నామని చెప్పారు, రైతులు పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె వెల్లడించారు. తహశీల్దార్ వెంట ఇరిగేషన్ ఏఈ నిమ్మకాయల శ్రీనివాసరావు ఉన్నారు. రెవిన్యూ సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

- తెలియని వారితో స్నేహం చేయొద్దు అప్రమత్తంగా ఉండండి
- ఎస్సై ఆంజనేయులు



కాకినాడ,మేజర్‌న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా "ఈగల్" యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ టీం వారిచే వారిచే మాదక ద్రవ్యాల నియంత్రణ మరియు న్యాయపరమైన శిక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. కాకినాడ జిల్లా ఈగల్ టీం ఆధ్వర్యంలో కాకినాడ ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఈగల్ టీం ఇన్చార్జ్ ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకూడదని,దేశప్రగతికి నాంది పలకాలని, విద్యార్థులు లక్ష్యసాధనకే కృషి చేస్తూ తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు.సాధారణ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తమ దృష్టికి వచ్చిన కేసులను ఉదాహరణతో వివరించారు. కొత్త వారితో పరిచయాలు వద్దని, ఏదైనా ఆశ చూపించే వారిని అసలు నమ్మవద్దు అని, తల్లిదండ్రులే ప్రధానమని పిలుపు నిచ్చారు. టీమ్ మెంబర్ ధర్మ తేజ మత్తు పదార్థాల కేసులకు సంబంధించినటువంటి శిక్షలను, 1972 టోల్ ఫ్రీ నెంబర్ యొక్క ప్రాధాన్యతను తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ రెండవ పట్టణ ఏఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ యువతే లక్ష్యంగా మత్తు పదార్థాల వాడకం జరుగుతుందని విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వాడకం చాప కింద నీళ్ల వ్యాపిస్తుందని, వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని కనుక ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.విద్యార్థి తమలక్ష్యాలను ఎన్నటికీ వదలకూడదని ఉన్నత ఉద్యోగాలను సాధించాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టీ తేజేశ్వరరావు రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ ఎం అప్పలనాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్, ఈగల్ టీమ్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, డి అశ్విని మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏలేరు జలాశయాలకు పెరుగుతున్న వరద



జగ్గంపేట, మేజర్ న్యూస్ : అకాల వర్షాల కారణంగా ఏలేరు జలాశయం ప్రమాదకరంగా మారనుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఏలేరు జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతుంది. ఈనెల 26 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తం అయ్యారు. ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండటంతో ప్రాజెక్ట్ నుంచి ఐదువేల క్యూసెక్కుల నీరు నుంచి పదివేల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ జలాశయం పూర్తిస్థాయిలో నీటిమట్టం 86.56 మీటర్లు (24.11 టీఎంసీ) కాగా ప్రస్తుతం నీటిమట్టం 85.58 మీటర్లు (22.10 టీఎంసీ ) చేరుకుంది. తుఫాన్ ప్రభావంతో రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. రిజర్వాయర్ నుంచి దిగువకు 3475 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు రిజర్వాయర్లో నీటిమట్టం పెరిగితే దిగువకు మరింతగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి నీటి విడుదల ప్రభావంతో కిర్లంపూడి, జగ్గంపేట,గొల్లప్రోలు, పిఠాపురం,యు కొత్తపల్లి, పెద్దాపురం మండలాలకు చెందిన పంట పొలాలతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యే ప్రమాదం ఉంది.

## ఆశ్రమ బాలిక, బాలుర పాఠశాలలో గంజాయి వల్ల కలిగే పర్యావసనాలపై అవేర్నెస్



రాజావొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని రాజావొమ్మంగి ఆశ్రమ బాలుర, బాలిక పాఠశాలలో గంజాయి వల్ల కలిగే పర్యవసనాలు స్థానిక సీఐ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సై శివకుమార్ ఆదివారం వివరించారు. గంజాయిను సేవించడం వల్ల ట్రాన్స్పోర్ట్ చేయడం కలిగేఅనర్థాలపైఅవేర్నెస్ మీటింగ్ కండక్ట్ చేశారు. ముఖ్యంగా యువత గంజాయికి దూరంగా ఉండాలని వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై సూచించారు. గంజాయి సేవించడం, ట్రాన్స్పోర్టేషన్ చేయడం వల్ల కలిగే అనర్థాలను తమ గ్రామాల్లో ఇంటి చుట్టుపక్కల వారికి తల్లిదండ్రులకు వివరించాలని ఎస్ఐ శివకుమార్ కోరారు.

## మొంథా తుఫాను పరిస్థితులు ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండండి

- విద్యుత్ సిబ్బందితో ఏఈ డేవిడ్ నిచ్చల్ సమావేశం



పెరవలి, మేజర్ న్యూస్ : మొంథా తుపాను దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని తుఫాన్ ప్రభావం, తీవ్రతపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని పెరవలి మండల విద్యుత్ ఏఈ డేవిడ్ నిచ్చల్ విద్యుత్ శాఖ సిబ్బందిని కోరారు. అక్టోబర్ 26వ తేదీ పెరవలి విద్యుత్ సబ్స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఉద్యోగులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. వివిధ మాధ్యమాల ద్వారా జిల్లా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు.ఈ సందర్భంగా సహాయక చర్యలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల ఏమైనా విద్యుత్ స్తంభాలు పడిపోవటం కానీ ఇతరత్రా నష్టాలు జరుగుతే అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆయన ఆదేశించారు.

## శ్రీ సూర్య కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ : పట్టణంలో సాయి శంకర్ నేత్రాలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు.వైద్య శిబిరానికి ముఖ్య అతిథి అమ్మ హాస్పిటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురి దేవి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.కాకినాడకు చెందిన శ్రీ సూర్య కంటి ఆస్పత్రి, ఏ ఎల్ ఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహింపబడిన వైద్య శిబిరంలో శ్రీ సూర్య కంటి ఆసుపత్రి ఫౌండర్ రాంప్రకాష్ సహాయ సహకారాలతో సూర్య హాస్పిటల్ డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనుసూరి నాగేశ్వరరావు,సూర్య హాస్పిటల్ ఫౌండర్ రాంప్రకాష్ లు మాట్లాడుతూ ప్రపంచస్థాయి ఆధునిక టెక్నాలజీతో ఏలేశ్వరం ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింద న్నారు.300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆపరేషన్ అవసరమైన కంటి దోషాలు గల వారిని కాకినాడ శ్రీ సూర్య కంటి ఆస్పత్రిలో వైద్యం అందిస్తామ న్నారు.అనంతరం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో కళ్ళజోళ్ళు అవసరమైన వారికి,లయిన్స్ క్లబ్ తరపున ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య హాస్పిటల్ ఆపరేషన్ హెడ్ శేషు సుబ్రమణ్యం,డాక్టర్ శివ,లయన్స్ క్లబ్ సభ్యులు అలమండ దుర్గాప్రసాద్,జ్యోతుల శ్రీనివాస్,ఊర రాజబాబు, గొల్లపూడి గణేష్,టి. రాము, ప్రజలు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించిన రంపచోడవరం రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకురాలు కారు అరుణ కుమారి డిమాండ్ చేశారు. సమాచారం కోరుతూ రంపచోడవరం ఎమ్మార్వో కార్యాలయంలో ఆగస్టు 26, 28వ తేదీలలో రెండు దరఖాస్తులు నరసాపురం గ్రామస్తులు పెట్టడం జరిగిందని తెలిపారు. అయితే సంబంధిత అధికారులు ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని ఇవ్వలేదని, ఇచ్చిన సమాచారం అసంపూర్తిగా ఉందని ఆమె తెలిపారు. అనంతరం మొదట అప్పీల్ పై రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు సెప్టెంబర్ 22వ తేదీన ఫిర్యాదు చేయగా అక్టోబర్ 24న విచారణకు పిలవడం జరిగిందన్నారు. విచారణకు హాజరైన సంబంధిత అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా అప్పీల్ అధికారి దగ్గరికి రావడం చూస్తే సమాచార హక్కు చట్టంపై రంపచోడవరం రెవెన్యూ అధికారులకు ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. సమాచారం కార్యాలయంలో అందుబాటులో లేనప్పుడు ఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందో ఆ కార్యాలయానికి సెక్షన్ 6(3) ప్రకారం దరఖాస్తును బదిలీ చేయాలని, కానీ రంపచోడవరం ఎమ్మార్వో కార్యాలయంలో పౌర సమాచార అధికారి ఆ పని చేయలేదన్నారు. రంపచోడవరం మండలంలో అక్రమంగా నడుస్తున్న మెటల్ క్వారీకి, దరఖాస్తుదారులు కోరిన సమాచారానికి సంబంధం ఉండటంతో అధికారులు ఉద్దేశ పూర్వకంగానే సమాచారం ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా సమాచారం ఇవ్వకపోతే డైరెక్ట్‌గా సమాచార హక్కు చట్టం కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం మీద అవగాహన లేక తప్పులు చేస్తున్నారా లేదా ఉద్దేశ పూర్వకంగా తప్పులు చేస్తున్నారా అనేది ఉన్నతాధికారులు దృష్టి సారించి, చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పౌర సమాచార అధికారులు, కార్యాలయం సిబ్బందిపై ముఖ్యంగా రంపచోడవరం తాసిల్దార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం మండల నాయకులు చోడి అనిల్ కుమార్, పొడియం అరుణకుమారి, కోసు దేవి శ్రీదేవి, దుర్గ భవానీ, పండమ్మ పాల్గొన్నారు.

## కాలేజ్ హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలోని స్థానిక మహారాణి కళాశాల ఎదురుగా ఉన్న గర్ల్స్ కాలేజీ హాస్టల్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ఉదయం పరిశీలించారు. దీనిలో భాగంగా హాస్టల్‌లో ఉన్న రూమ్‌లు, పరిశుభ్రతను పరిశీలిస్తూ విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతపై విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి నాయకులు సూనె రామారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జల్దాని బాబీ, హెచ్‌డబ్లూట శ్రీవల్లి, తదితరులు ఉన్నారు.

# 50 ఏళ్లు దాటిన వృక్షాలను అధికారులు సజీవంగా తరలించే ఏర్పాట్లు చేయాలి

**– వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కర రావు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండల వ్యాప్తంగా 50 సంవత్సరాలు దాటిన రావి చెట్టు వృక్షాలు కొన్నిచోట్ల స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటిని కొట్టకుండా నిర్మూలించకుండా తుఫాన్లు బారిన పడకుండా అక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా సజీవంగా ఇతర ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేయాలని పెరవలి మండలం వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయభాస్కరరావు మండల స్థాయి అధికారులను, సిఆర్డిఏ మరియు ఫారెస్ట్ అధికారులను కోరారు. అక్టోబర్ 26వ తేదీ ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ఎదురుగా ఉన్న రావి చెట్టు మహావృక్షంగా మారి ఆహ్లాదంగా ఉన్నప్పటికీ తుఫాను సమయాల్లో ఆ చెట్టు కూలి ఆలయంపై పడితే ఆలయం ధ్వంసం అయ్యే ప్రమాదం ఉందని శ్రీవారి భక్తులు ఆందోళన చెందుతున్నారని అలాగే 16 నెంబర్ జాతీయ రహదారి ప్రక్కనే ఉండటంతో జాతీయ రహదారిపై పడితే వచ్చిపోయే వాహనాల మీద పడి జన నష్టం తీవ్రంగా ఉంటుందని ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుందని కావున ఇప్పుడే మేల్కొంటే భారీ నష్టం తప్పుతుందని ఈ విషయాన్ని అధికారులు వెంటనే పరిశీలించాలని ఆయన కోరారు. అంతేకాక రాబోయే పుష్కరాలకు ఆలయం పునర్నిర్మాణం కోసం ఆలోచన దానికి తగ్గ ప్రయత్నాలు చేస్తున్నారని దానికైనా ఈ చెట్టు తరలించక తప్పదని కావున అధికారులు వెంటనే ఈ భారీ వృక్షాన్ని సజీవంగా తరలించడానికి తగు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా పెరవలి హేమాద్రి రైస్ మిల్లు వద్ద వంద సంవత్సరాల నాటి రావిచెట్టు అక్కడ విద్యుత్ సరఫరాకు ఇబ్బందికరంగా ఉందని ఆ చెట్టును తొలగించడానికి చూస్తున్నారని ఇటువంటి వృక్షాలను సజీవంగా తరలించి క్యాపిటల్ రీజియన్ సీఆర్డీఏ అమరావతిలో నెలకొల్పడానికి సిఆర్డిఏ అధికారులు ప్రయత్నిస్తున్నారని కావున ఫారెస్ట్ అధికారులు, సీఆర్డీఏ అధికారులు ఈ వృక్షాలు తరలింపుపై చొరవ చూపాలని ఆయన కోరారు. ఒకవైపు ఏపీ వైపు దూసుకొస్తున్న మొంథా తుఫాన్ వార్తలు బెంబేలిస్తున్నాయని నేటి నుంచి నాలుగు రోజుల పాటు తుఫాన్ పెను ప్రభావం చూపే అవకాశం ఉందని ఈ నెల 28న కాకినాడ సమీపంలో తీవ్రమైన తుఫానుగా తీరం దాటే అవకాశం ఉందని తుఫాన్ తీవ్రత పెరిగితే భారీ వృక్షాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కాకినాడ సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉండటంతో ప్రజలు బెంబలెత్తుతున్నారని కావున ఈ భారీ వృక్షాలను సజీవంగా తరలించే ఏర్పాట్లు తక్షణమే తీసుకోవాలని ఆయన కోరారు.

# నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాలు

**– ఎనిమిది చోట్ల నిర్వహణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ద్వారా లక్ష్మీ నగర్, రెల్లీ పేట, ఏటి మొగ, గైగోలుపాడు, నూకలమ్మ మాన్యం, గోళీల పేట, ఉపలంక ప్రజలకు మరియు నచికేత బాలల ఆవాసంలో విద్యార్థులకు కాకినాడకి చెందిన ప్రముఖ వైద్యులు డా. యు.ఆర్.కె. రామకృష్ణ, డా అడ్డాల సత్యనారాయణ, డా.త్రిమూర్తులు రాయుడు, లడా నిశాంత్, డా.శాస్త్రి, డా.సృజన, డా.చలం, డా.విద్యా, డా.గౌతమ్ ప్రవీణ్, డా.ఆదిత్య, డా.సుష్మా, డా.నర్సింగ్, డా.వెంకటేష్,డా. సమంత్, డా.కామేశ్వరి, డా.లింగోలు చందు, డా.వర ప్రసాద్, డా.ప్రసోబ్, రంగ రాయ వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని డా. శివరామ రాజు, శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా సేవా భారతి సంస్థ సభ్యులు రాజా రామచంద్ర మాట్లాడుతూ "ఈ రోజున కాకినాడకి చెందిన ప్రముఖ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొని కాకినాడకి చెందిన ప్రముఖ వైద్యులు ఎనిమిది చోట్ల నిర్వహించిన వైద్య శిబిరాలలో సుమారు వెయ్య మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారనీ, ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు నిర్వహించి, ఇంత మంది ప్రజలకి వైద్య పరీక్షలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ మెగా కార్యక్రమాన్ని అల్లూరి సీతారామరాజు స్థానీయ సేవా యాత్ర వారు అధ్భుతంగా నిర్వహించారని అన్నారు.

# సిఐటియు జిల్లా అధ్యక్షులుగా శేషుబాబ్జి - కార్యదర్శిగా రాజ్‌కుమార్



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** సిఐటియు కాకినాడ జిల్లా 12వ జిల్లా మహాసభలలో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది.సిఐటియు జిల్లా అధ్యక్షులుగా దువ్వా శేషుబాబ్జి, ప్రధాన కార్యదర్శిగా చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారిగా మలక రమణ, ఎన్నికయ్యారు. నూతన కమిటిని జిల్లా ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ ప్రతిపాదించగా, 11 మంది ఆఫీస్ బేరర్లు, జిల్లా కమిటి సభ్యులు, 27 మంఇ జిల్లా కమిటి సభ్యులు కలిపి 33 మంది నూతన కమిటి ఎన్నికయ్యింది. ఉపాధ్యక్షులుగా జి.బేబిరాణి, కె.సత్తిరాజు, చంద్రావతి, జిల్లా కార్యదర్శిగా దారపురెడ్డి క్రాంతికుమార్, చంద్రమళ్ళ పద్మ, రొంగల ఈశ్వరరావులు ఎన్నియ్యారు. జిల్లా కమిటి సభ్యులుగా పలివెల వీరబాబు, షేక్ పద్మ, నక్కెళ్ళ శ్రీను, బాబూరావు, నొక్కు లలిత, రత్నం, దుర్గా, తదితరులు ఎంపికయ్యారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ ఎన్నికను పర్యవేక్షించారు.

# 8వేల కోట్ల టర్నోవర్లతో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు

**– చైర్మన్ సత్యనారాయణ**




**అమలాపురం, మేజర్ న్యూస్ :** విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభించి 110 ఏళ్లలో 8వేల కోట్ల టర్నవర్లలో ముందుకు దూసుకెళుతుందని ఆ బ్యాంకు చైర్మన్ జేవి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం అమలాపురం ముస్లిం వీధి వద్ద నూతన బ్రాంచ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నేడు అమలాపురంలో 58వ బ్రాంచ్ ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద అర్బన్ బ్యాంకుగా విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు అవతరించిందని తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 56 బ్రాంచ్ లతో సామాన్యులకు సేవలు అందించగా ఈ ఏడాది నూజివీడు తెనాలిలో 57వ బ్రాంచ్ ప్రారంభించగా 58వ బ్రాంచ్ అమలాపురంలో ప్రారంభించడం ఆనందకరమన్నారు. అమలాపురంలో ప్రారంభించబోయే బ్రాంచ్‌లో ఐదేళ్లలో 100 కోట్లు లావాదేవీలే లక్ష్యంగా పనిచేయటం జరుగుతుందని ఆయన అన్నారు. 2025 సెప్టెంబర్ నాటికి డిపాజిట్లు 4 వేల508 కోట్లు కాక రుణాలు మూడు వేల 561 కోట్లు తో కలిపి మొత్తం 8వేల 70 కోట్లతో ఆర్థిక కార్యకలాపాలతో దేశంలోనే మూడవ స్థానంలో కో–ఆపరేటివ్ బ్యాంకు సేవలందిస్తుందని ఆయన పేర్కొన్నారు.మా బ్యాంకులో కస్టమర్లు తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీ మొత్తంలో నాలుగు శాతం తిరిగి కస్టమర్లకు అందించడం జరుగుతుందన్నారు. ఈ బ్యాంకులో ఒక సభ్యునికి మూలధనం రెండు లక్షలు మాత్రమే పరిమితం చేయడం జరిగిందన్నారు. బంగారం రుణాలపై ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా కస్టమర్లకు సేవలు అందించడం జరుగుతుందని, 50 లక్షల వరకు గోల్డ్ టర్మ్ రుణాలు మా బ్యాంక్‌లో ఇవ్వడం జరుగుతుందని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు సీఈవో వరలక్ష్మి, కాకినాడ జోనల్ మేనేజర్ టి.ఆర్. ఠాగూర్, బ్రాంచ్ మేనేజర్ శాంతి కుమారి రెడ్డి, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించిన వాడపల్లి క్షేత్రం

**– స్వామివారిని దర్శించిన రాజమండ్రి సెంట్రల్ జైల్ ఎస్పీ రాహుల్**
**– నిత్య అన్నదాన పథకానికి విరాళాలు**




**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి క్షేత్రం ఆదివారం భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది.ఏడు శనివారాలు స్వామిని దర్శించి అష్టోత్తర పూజలు చేసుకునే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారిని రాజమండ్రి సెంట్రల్ జైల్ ఎస్పీ శ్రీరామ రాహుల్ సతీ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం నిర్వహించి స్వామి చరిత్ర గురించి వివరించారు.నిత్య అన్నదాన పథకానికి రామచంద్రపురం, గణపవరంకు చెందిన కొండేటి వెంకటరత్నం, వారి కుటుంబ సభ్యులు రూ.30,116లు; రాజమండ్రికి చెందిన భూపతిరాజు సాయి శరత్ వర్మ, వారి కుటుంబ సభ్యులు రూ.36,500లు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వీరికి ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# కాకినాడలో పునరావాస కేంద్రాల తనిఖీ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు ఆదివారం సాయంత్రం సందర్శించారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సాగిలిఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ కేటీ సుధాకర్, అర్బన్ తహసీల్దార్ జితేందర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు కాకినాడ నగరంలోని జగన్నాథపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాలను పరిశీలించారు. కాకినాడ నగరంలో జగన్నాథపురం ప్రాంతంలో పరదేశమ్మపేట, నాగరాజు పేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కూడా సందర్శించి, అక్కడి సదుపాయాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసి, తుఫాన్ పరిస్థితుల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

# విద్యార్థినిలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి - ఎస్సై మౌనిక



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పి బింధు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో పెద్దాపురం సిఐ విజయ్‌శంకర్, ఎస్సై వి.మౌనికల ఆధ్వర్యంలో మండలంలోని దివిలి గ్రామంలో గల ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థుల యోగక్షేమాలు ఆదివారం తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై వి.మౌనిక విద్యార్థులతో మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహనతో పాటు ఆన్‌లైన్ మోసాలకు గురి కావద్దని, కాలేజికు వెళ్ళే దారిలో ఎవరైనా ఆకతాయిలు ఏడిపించినా, తమ దృష్టికి తీసుకురావాలని, చదువుకునే వయసులో ఎవరి చేతులలో మోసపోవద్దని, తల్లితండ్రులు తప్ప ఎవరితోను మాట్లాడవద్దని, హాస్టల్ వద్దకు ఎవరిని రప్పించవద్దని, ఆమె తెలిపారు.

అలాగే పరిసరాలు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందని, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వాటి వలన సమయం వృదా చేసుకోవద్దని ఎస్సై మౌనిక విద్యార్థులకు సూచించారు.

# కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం

**– జాతి సమైక్యత, పటిష్టత కోసం వన సమారాధనలు**
**– దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి**
**– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** శెట్టిబలిజ జాతి కోసం నిత్యం పరితపించిన జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనకు పునరంకితం అవుదామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం చెరుకూరి వారి తోటలో జరిగిన కార్తీక వన సమారాధన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. తొలుత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికిపూలమాలలు వేసిఘనంగా నివాళు లు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన సంఘీయులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి యొక్క కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు మంత్రి సుభాష్. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జాతి సమైక్యత కోసం ప్రతి ఏటా మన సమారాధన నిర్వహించి జాతి ఐక్యత, పటిష్టతకు కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. ఇతర జాతులను గౌరవిస్తూనే.. శెట్టిబలిజల అభ్యున్నతి కోసం సంఘీయులంతా కృషి చేయాల ని పిలుపునిచ్చారు.శెట్టిబలిజ జాతిపిత కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పేర్కొన్నారు. నవంబర్ 16న అమలాపురంలో భారీ అంచనాలతో జరిగే శెట్టిబలిజల వన సమారాధనకు రాజకీయ పార్టీలకు అతీతంగా హాజరై సంఘ ఐక్యతను చాటాలని కోరారు. సంఘం పటిష్టత, ఐక్యత, రాజ్యాధికారం సాధన దిశగా సంఘీయులంతా కృషిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, ఇందుకు తానే ఒక ఉదాహరణ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి సుభాష్‌ను, అతిథిగా విచ్చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, దొమ్మేటి సుధాకర్, మట్టపర్తి సత్యనారాయణ, బత్తిన ఏడుకొండలు, సాన బోయిన రామారావు,బొక్క సత్య వెంకట ప్రతాప్, కొప్పిశెట్టి నాగేంద్ర, కోడి దుర్గారావు, గుత్తుల మధు, పెద్ద ఎత్తున శెట్టిబలిజ సంగీయులు తదితరులు పాల్గొన్నారు.

# ‘మొంథా’ తుపాను దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయండి

**– ఫోన్ కాల్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు మంత్రి కందుల దుర్గేష్ సూచన**
**– ఎర్రకాలువ ముంపు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పంట నష్టపోకుండా రైతాంగానికి మార్గదర్శకత్వం అందించాలని మంత్రి దుర్గేష్ ఆదేశాలు జారీ**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ‘మొంథా’ తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా “మొంథా” తుఫాన్ పై ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ కాల్ ద్వారా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి సూచించారు. తుఫాన్ ప్రభావం, తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ మాధ్యమాల ద్వారా జిల్లా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిత్యావసర వస్తువులకు, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండాచూసుకోవాలన్నారు.ఈ సంద ర్భంగా సహాయక చర్యలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల ఎర్రకాలువ ముంపుకు పంట నష్టపోకుండా రైతాంగాన్ని అప్రమత్తం చేయాలని, ఎర్రకాలువ గట్లు తెగకుండా పటిష్ట పరిచేందుకు ముందస్తుగా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురికాకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.



## పెరవలి అయ్యప్ప పీఠంలో ఘనంగా పడిపూజ కార్యక్రమం

**పెరవలి, మేజర్ న్యూస్ :** నాగుల చవితి సందర్భంగా పెరవలి గ్రామంలో అక్టోబర్ 25వ తేదీ శనివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంను జనసేన మండల అధ్యక్షులు, న్యాయవాది పిప్పర రవి స్వామి,అల్లాడి రామకాశీస్వామి,పిప్పర వెంకన్న స్వామి, ఉగ్గెపల్లి వెంకటేష్ స్వామి లతో పీఠం గురు స్వాములు మానికిరెడ్డి మురళీకృష్ణ స్వామి, సలాది శ్రీహరి స్వామి భక్తిశ్రద్ధలతో చేయించారు. హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కు పల్లాభిషేకాలు చేసి, నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో అధిక సంఖ్యలో స్వామి మాలలు పెరవలి అయ్యప్ప స్వామి పీఠంలో వేస్తారని ప్రత్యేక గుర్తింపు వుంది.దానితో పాటు స్వాములుకు అల్పాహారం,బిక్ష లను కూడా పీఠం వద్దే ఏర్పాటు చేసియున్నారు. పడిపూజను చూసేందుకు భక్తులు పీఠం వద్దకు విచ్చేసారు. ఈ పూజ కార్యక్రమంలో అరిగెల సత్తిపండు స్వామి,ఉంగట కిషోర్ స్వామి, తాతోలు అన్నవరం స్వామి, అల్లం శివ స్వామి,నాగిరెడ్డి వీరాస్వామి, పోతుల గణేష్ స్వామి, అనిల్ రాజు స్వామి, చిన్నమిల్లి సాయి స్వామి, కడలి రాము స్వామి లతో పాటు ఇతర స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రానున్న మూడు రోజులు ‘మొంథా’ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, బంగాళాఖాతంలో ఏర్పడిన ‘మొంథా’ తుఫాన్ వాయుగుండం ప్రభావం వల్ల రానున్న మూడు రోజుల్లో విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో వాగులు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, అగ్నిమాపక, వైద్యశాఖ, పోలీసు శాఖ పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని సబ్ కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ నంబర్లు – 6300-772025 / 08864-243561 (రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం)ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. తుఫాన్ సమయంలో విద్యుత్ తీగలు, చెట్లు, కూలిన భవనాల సమీపానికి వెళ్లకూడదని, రాత్రి సమయంలో ప్రయాణాలు చేయకుండా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా పర్యాటక ప్రాంతాలు మురికిగా మారే అవకాశం ఉన్నందున, మైదాన ప్రాంతాల నుండి పర్యాటకులు వర్షాలు తగ్గే వరకు ఏజెన్సీ ప్రాంతాలకు రాకూడదని ఆయన సూచించారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా దేవీపట్నం మండలం పోచమ్మ గండి ఫెర్రీ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోటు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.పర్యాటకులు,బోటు యాజ మానులు, సిబ్బంది ప్రజలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. అలాగే పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, టూరిజం శాఖల అధికారులు ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని, ఎటువంటిఅనధికార బోటులో ప్రయాణాలను అనుమతించ రాదని ఆయన స్పష్టం చేశారు. ఎక్కడైనా వరదలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినట్లయితే, ప్రజలు సంబంధిత మండల తహసీల్దార్లను లేదా రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సబ్ కలెక్టర్ సూచించారు.

## ‘మొంథా’ తుపాను నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మొంథా తుపాను కాకినాడ తీరాన్ని తాకే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. తుఫాన్ ప్రభావం కాకినాడ జిల్లా పై ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ముఖ్యంగా మత్స్యకార గ్రామాల ప్రజలు మరింత జాగ్రత్త వహించాలని కోరారు. ఏలేరు రిజర్వాయర్ నుండి నీటిని వదిలితే జగ్గంపేట, పెద్దాపురం పిఠాపురం నియోజవర్గంలో పలు లోతట్టు ప్రాం తాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. తుఫాను ముప్పును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదంలో ఉన్న హెూప్ ఐలాండ్ వాసులను.. సురక్షిత ప్రాంతాలకు తరలింపు

**– జిల్లా కలెక్టర్ షాణ్మోహన్ ఆదేశాలు**







**కాకినాడ, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ నేపథ్యంలో కాకినాడ హెూప్ ఐలాండ్ నివాసితులను నివాసితులను రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ, పోర్ట్ అధికారుల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు ఆదివారం తరలించారు. ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ నేపథ్యంలో హెూప్ ఐలాండ్‌లో నివాసం ఉంటున్న సుమారు 110 మందిని కలెక్టర్ షాన్మోహన్ ఆదేశాలతో ప్రత్యేక బోట్లలో తీసుకువచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తమను సురక్షిత ప్రాంతాలకు తరలించిన జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ షాన్మోహన్‌కు హెూప్ ఐలాండ్ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## తుఫాన్ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవు

**– జిల్లా కలెక్టర్ వెల్లడి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదివరకూ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.
మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలు గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 5 రోజులపాటు సెలవు దినాలుగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.
జిల్లాలోని సాంఘిక సంక్షేమ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులందరూ ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం లోగా వారి వారి ఇండ్లకు వెళ్లే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో సజావుగా అమలయ్యే విధంగా జిల్లా విద్యాధికారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.